క్లుప్తంగా

నేడు మల్లంపాలెంలో స్వయంభూ విఘ్నేశ్వర తీర్థం

మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాట ప్రదర్శన


గల స్వయంభూ విఘ్నేశ్వర స్వామి

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామంలో భోగి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తీర్థం పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాట ప్రదర్శనలు జరపనున్నట్టు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన మేలుకొలుపు కార్యక్రమాలు


సాగరంలో చివరిరోజు మేలుకొలుపు కార్యక్రమంలో భక్తులు

మాడుగుల రూరల్ : ధనుర్మాసంలో మండలంలో పలు గ్రామాల్లో భక్తులు నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమాలు ఆదివారం నాటితో ముగిసాయి. ధనుర్మాసం ప్రారంభం నాటి నుంచి ఉదయం వేళల్లో ప్రధాన ఆలయాల నుంచి భక్తులు మేలుకొలుపు కార్యక్రమాలను చేపట్టారు. చివరిరోజు సాగరం కాలనీలో సర్పంచ్ కోట్నీ జయమ్మ సన్యాసినాయుడు పర్యవేక్షణలో ప్రజల ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఉపాధ్యక్షునిపై కోతుల దాడి


కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బలరాంస్వామి

మాడుగుల రూరల్ : కె.జె.పురం–మాడుగుల దబ్బగుంట మార్గంలో శ్రీరాధాకృష్ణ ఆలయం దగ్గర ఉన్న పొలాల వద్ద కోతుల గుంపు దాడిలో ఆదివారం కె.జె.పురానికి చెందిన నీటి సంఘం ఉపాధ్యక్షుడు యల్లపు బలరాం స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. దాడిలో గాయపడ్డ బలరాం స్వామిని ఆయన కుమారుడు రాము వెంటనే మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి కోతుల నుంచి పంటలను, ప్రజలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


ఏకా నర్సింహమూర్తిని సన్మానిస్తున్న ఎంఈవో-2 జగ్గారావు, సహచర ఉపాధ్యాయులు, శిష్యులు

రోలుగుంట : మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా వై.బి.పట్నం హెచ్ఎం ఏకా నర్సింహమూర్తి ఎంపికైన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయనకు గతేడాది సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు ఆదివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో-2 జగ్గారావు, సహచర ఉపాధ్యాయులు, శిష్యులతో కలిసి నర్సింహమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు మేలైన బోధన అందించడంతో పాటు క్రమశిక్షణతో సమయ పాలన పాటిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు.

విద్యుత్ తీగలు లేని చోట గాలిపటాలు ఎగురవేయాలి

ఎస్.రాయవరం: సంక్రాంతి సంబరాల్లో పిల్లలు గాలిపటాలు ఎగుర వేసేందుకు విద్యుత్ వైర్లు లేని ప్రదేశాలు ఎంచుకోవాలని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సూచించారు. సంక్రాంతికి ఎక్కువగా పతంగులు పండగ చేసుకుంటారని, తల్లిదండ్రులు అప్రమత్తమై జాగ్రత్తలు చెప్పాలన్నారు.

పల్లె గూటికి పండగొచ్చింది...

- స్వగ్రామాలకు చేరుకుంటున్న వలస ప్రజలు
- తీర్థాల్లో ఉరకలేయడానికి సిద్ధం అవుతున్న గుర్రాలు
- పొలాల్లో వరి నూర్పిళ్లు


భోగిమంటలను వేసేందుకు కర్రలను సిద్ధం చేస్తున్న యువకులు


తీర్థాల్లో రేసు గుర్రాలను పోటీలకు సిద్ధం చేసిన దృశ్యం (ఫైల్)


కోడూరులో మంటల్లో వేసేందుకు కమ్మలను సిద్ధం చేస్తున్న యువకులు


సత్యవరం గ్రామంలో పొలాల్లో నూర్పిడి చేసిన ధాన్యం

మాడుగుల :పల్లెలోగిటలో సంక్రాంతి సంబరాలుకు సర్వం సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాల కారణంగా వరి చేలు తడిసి ముద్దవ్వడంతో ఇంతవరకు రైతులు ధాన్యం నూర్పిడి పనుల్లో ఉన్నారు. నూర్చిన ధాన్యం ఎండబోస్తున్న పనిలో రైతులు ఉన్నారు. ఇంకా ధాన్యం అమ్మకాలు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో రైతులు ఇంట సంక్రాంతి శోభ కనిపించలేదు. గత ప్రభుత్వంలో ఏదో ఒక పథకం ద్వారా రైతులకు డబ్బులు అందేవి. ప్రస్తుతం పంటల నష్టం జరగడంతో అంతంతమాత్రంగానే పండగకు అన్నదాతలు సిద్ధం అవుతున్నారు.

గోవాడ సుగర్‌ఫ్యాక్టరీకి కూడా రైతులకు చెరకు అడ్వాన్సులు ఇవ్వకపోవడంతో రైతుల చేతిలో డబ్బులేక పోవడంతో పల్లె లోగిళ్లలో కూడా అంతంత మాత్రమే పండగ శోభ కనిపిస్తోంది.

భోగి మంటలకు సర్వం సిద్ధం

కె.కోటపాడు : మండల గ్రామాల్లో భోగి పండగను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎ.కోడూరులో గల కొత్తూరు ప్రాంతానికి చెందిన యువకులు ఒకే చోట భోగి పండగను జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున భోగిమంటలను వేయడానికి కర్రలు, కమ్మలు సిద్ధం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఈ భోగి పండగను యువకులు వేడుకగా జరిపేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి తీర్థాలు..

గ్రామాల్లో భోగి రోజు నుంచి తీర్థాలు ప్రారంభం అవుతాయి. ఎడ్ల పరుగు పందాలతో పాటు గుర్రం పరుగు పోటీలకు పందెంరాయుళ్లు సిద్ధం అవుతున్నారు. నాటి రాజుల పాలనలో రేసుగుర్రాలు అధికంగా పోషించేవారు. ఆనాడు ప్రయాణ సాధనాలు అవే. ఆతర్వాత కూడా జటకా బళ్లు అందుబాటులోకి వచ్చాయి. జటకా బళ్ల స్థానంలో ఆటోలు రావడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గుర్రాల వాడకం తగ్గిపోయింది. కానీ ఈ నాటికీ అక్కడక్కడ గుర్రాలను పెంచి పోషిస్తున్నారు. సంక్రాంతి తర్వాత నెల రోజులు పాటు జరిగే తీర్థాల్లో పరుగు పోటీలు నిర్వహిస్తున్నారు. రేసు గుర్రాల పోటీలు ఉంటే జనం ఎంత దూరమైనా వెళ్లి పోటీలను ఆసక్తిగా తిలకిస్తుంటారు.

స్నేహపూర్వకంగా పండగ జరుపుకోవాలి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ మోహనరావు

గొలుగొండ : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికతో ముందుకెళితే విజయాలు సొంతమవుతాయని డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహనరావు సూచించారు. కృష్ణదేవిపేటలో మైత్రి గ్రంథాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. పోటీ పరీక్షలకు అవసరమైన రూ.15 వేలు విలువైన స్టడీ మెటీరియల్, డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ గ్రూప్స్‌కి సంబంధించిన పుస్తకాలు, రీడింగ్ చైర్స్‌ను గ్రంథాలయానికి అందజేశారు. అంతేకాకుండా తొందరలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు కె.జె.పురంలో గోదాదేవి కల్యాణం


కళ్యాణ వేంకటేశ్వరస్వామి

మాడుగుల రూరల్ : భోగి పండగ సందర్భంగా కె.జె.పురం గ్రామంలో సోమవారం రాత్రికి గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్టు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి తిరువీథోత్సవం ఉదయం గ్రామంలో జరుగుతుందని, అనంతరం స్వామి వారిని కళావేదిక పై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తామన్నారు.


ప్రత్యేక అలంకరణలో మాడుగుల పార్థసారథి స్వామివారు

మాడుగుల : స్థానిక అతిపురాతన పార్థసారథి స్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం అత్యంత వైభవంగ గోదాదేవి కల్యాణం జరగనుందని, ఆలయ ప్రధాన అర్చకుడు పార్థసారదాచార్యులు తెలిపారు. ఇప్పటికే స్వామివారిని గోదాదేవిని పుష్పాలు నగలతో ప్రత్యేకంగా అలంకరించామన్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి కొనసాగుతున్న తిరువీధి ఉత్సవాలు కనుమ పండుగ రోజుతో ముగుస్తాయన్నారు. కల్యాణోత్సవాలు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నారని తెలిపారు.


గోదాదేవి తిరువీధి ఉత్సవంలో కీర్తనలు ఆలపిస్తున్న భక్తబృందం

రోలుగుంట : మండలం కేంద్రంలో గల సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘాల సభ్యులు సంయుక్తంగా ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నెలలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. దీనిలో భాగంగా గోదాదేవిని మండలంలో గల గ్రామాల్లో రోజుకో గ్రామం వెళ్లి ఆ వీధిలో తిరుగుతూ వేకువజామునే విష్ణుమూర్తికి మేలుకొలుపు భక్తిగీతాలు ఆలపిస్తున్నారు. ఉత్సవమూర్తులను దర్శించుకొని భక్తుల ఇస్తున్న కానుకలు స్వీకరిస్తున్నారు. సుమారు 20 ఏళ్లుగా ఈ మేలుకొలుపుల కార్యక్రమాన్ని ధనుర్మాసంలో నిర్వహిస్తున్నామన్నారు. భోగి రోజుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తుల నుంచి సేకరించిన ధన, ధాన్యం సేకరణ మొత్తంతో గోదాదేవి కళ్యాణ అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమం విజయవంతానికి భక్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతి ఆటల పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ భీమరాజు

నాతవరం : సంక్రాంతి పండగ సందర్భంగా కేఎస్ఆర్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో ఆటల పోటీలు ఏర్పాటు చేయడం వల్ల యువతకు చక్కని ఆటవిడుపుగా ఉంటుందని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. మండల కేంద్రంలో కేఎస్ఆర్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. కేఎస్ఆర్ గ్రూపు సభ్యులు నాతవరం గ్రామంలో పండగ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయడం మంచి పరిణామని పేర్కొన్నారు. ఆటలు పోటీలు జరుగుతుంటే యువత చెడు వ్యసనాలపై దృష్టి సారించకుండా ఉంటారన్నారు. మండల కేంద్రంలో ఆటల పోటీల నిర్వహణకు గ్రామం మధ్యలో అటవీ శాఖకు చెందిన భూమి ఉండడం అన్ని విధాలుగా బాగుంటుందన్నారు. ఆటల పోటీల్లో నైపుణ్యం కనబరిచిన జట్లకు నగదుతో పాటు షీల్డ్, ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని కేఎస్ఆర్ గ్రూపు సభ్యులు ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు పైల పోతురాజు, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్ ఆటల పోటీల నిర్వాహకులు శౌవ, నానాజీ, గోపీ, వివిధ పార్టీల నాయకులు చింతకాయల శ్రీను, బంగారు సూరిబాబు, సామర్ల రామారావు, నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి ఎస్.సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇట్టంశెట్టి సీతారామమూర్తి, అంకంరెడ్డి యర్రాపాత్రుడు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్టుకు స్పందన


మోడల్ టెస్టుకు హాజరైన విద్యార్థులు

చోడవరం రూరల్ : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి ఆడమ్స్ స్కూల్లో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. నిర్దేశిత సమయంలో మోడల్ పరీక్షను సైతం కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వాహకులు పూర్తి చేశారు. చోడవరంతో పాటు పరిసర మండలాలైన బుచ్చియ్యపేట, రావికమతం, చీడికాడ, మాడుగుల, కె.కోటపాడు, అనకాపల్లి మండలాల నుంచి 250 మంది విద్యార్థులు మోడల్ పరీక్షను రాశారు. ఈ నెల 18 నవోదయ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉన్నందున పరీక్షకు హాజరు కాగోరు విద్యార్థులు ఆసక్తిగా పరీక్ష రాసారు. నమూనా పరీక్ష అనంతరం ఆయా విద్యార్థులకు కీ జవాబు పత్రాన్ని అందచేశారు. దీని వల్ల ఆయా విద్యార్థులకు ఈ పరీక్షలో ఎన్ని మార్కులు వచ్చాయి, ఎక్కడ తప్పు చేసామన్నదీ తెలుస్తుందని పీఆర్‌టీయు నాయకులు ఎ.వి. స్వామి, కెఎల్ఎన్ గణేష్, త్రినాథ్ తెలిపారు. మూడు రోజుల్లో పరీక్ష ఫలితాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్ రూపంలో తెలియ పరుస్తామని, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను సైతం అందజేస్తామని తెలిపారు. పరీక్షను సజావుగా నిర్వహించి, విద్యార్థులకు, తమకు సహకరించిన ఆడమ్స్ వెంకటరావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

రేపు నియోజకవర్గ స్థాయి సంక్రాంతి సంబరాలు


స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం రూరల్ : మండలంలోని లక్ష్మీపురం, దామునాపల్లి గ్రామాల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించనున్నారు. చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో జరపనున్న సంబరాలను శాసనసభ్యుడు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో జరపనున్నారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ రోజు 9 గంటలకు లక్ష్మీపురం గ్రామంలో ముగ్గులపోటీ నిర్వహిస్తారు. విజేతలకు వరుసగా ఆరు, నాలుగు, మూడు, రెండు వేల రూపాయల నగదును బహుమతులుగా అందజేస్తారు. వివరాలకు గ్రామానికి చెందిన శిరిసోళ్ళ చినబాబును 8919416898 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం దామునాపల్లిలో ఎడ్ల బళ్ల పరుగు పోటీలు ఉంటాయి. విజేత ఎడ్ల యజమానులకు వరుసగా 15, 10, 8, 6, 4, 3 వేల రూపాయల నగదును బహుమతులుగా అందజేస్తారు. వివరాలకు మాజీ సర్పంచ్ పాతాళం శ్రీనును 9908726044, తలారి సంతోష్‌ను 9652628283 నంబర్ల సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కోడిపందాలు, బల్లాటలు నిర్వహిస్తే కేసులు


దేవరాపల్లిలో ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న ఎస్ఐ టి.మల్లేశ్వరరావు

దేవరాపల్లి : సంక్రాంతి, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకొని అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తే ఎంతవారినైనా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆటోలో మైక్ ద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన మైక్ ద్వారా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోడిపందాలు, పొట్టేలు పందాలు, పేకాట, బల్లాటలు నిర్వహించినా, అశ్లీల నృత ప్రదర్శన చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండగకు ఊర్లు వెళ్లే వారు తమ ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు అభరణాలు, నగదును జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని మండల ప్రజలకు ఆయన సూచించారు.

నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన


నమూనా పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

నర్సీపట్నం : పీఆర్‌టీయు ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. పరీక్షకు 400 మంది విద్యార్థులు హాజరయ్యారని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. ఈ నెల 18న నవోదయ పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో భయం, ఆందోళన పోగొట్టేందుకు నమూనా పరీక్ష పెట్టామన్నారు. ఈ పరీక్ష ద్వారా సమయపాలన విద్యార్థులకు అర్థమవుతుందన్నారు. నమూనా పరీక్ష నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, అరకు, పాడేరు, చింతపల్లి, గోపాలపట్నం, గురుద్వార్ విశాఖపట్నం కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి నగదు పురస్కారం, షీల్డ్‌ను అందిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు : స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకొని గొండుపాలెం హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రామానికి చెందిన సమాజ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం కె.కోటపాడుకు చెందిన వేణు విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని, ద్వితీయ, తృతీయ స్థానాలలో చౌడువాడ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నిలిచారు. వీరికి నిర్వాహకులు నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో బండారు వెంకటరమణమూర్తి, బండారు రామలక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

రోలుగుంట: స్థానిక ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శనివారం ప్రారంభమైన క్రికెట్ పోటీలు ఆదివారం కూడా కొనసాగాయి. ఆదివారం నాటి పోటీల్లో వినాయక వారియర్స్ జట్టుతో శ్రీగౌరీ వారియర్స్ తలపడగా వినాయక వారియర్స్ విజయం సాధించింది. గల్లీబాయ్స్ జట్టుతో వినాయక వారియర్స్ జట్టు తలపడగా వినాయక వారియర్స్ విజయం సాధించింది. సింబాల్ లివన్ జట్టుతో వినాయక స్టార్స్ తలపడగా సింబాల్ లెవన్ విజయం సాధించింది. ముగింపు రోజున విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

కె.కోటపాడులో ఘనంగా వివేకానంద 162వ జయంతి


కె.కోటపాడులో వివేకానంద విగ్రహానికి పూలమాలను వేస్తున్న డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్


జీ కోడూరులో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నేతలు, స్థానికులు

కె.కోటపాడు : యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కె.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. కె.కోటపాడులో గల అయ్యన్న పాఠశాల ప్రాంగణంలో గల స్వామి వివేకానందుని విగ్రహానికి 162వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద సమాజంపై అత్యంత ప్రభావం కలిగించిన ఆధ్యాత్మిక నాయకుడని అన్నారు. కార్యక్రమంలో అయ్యన్న పాఠశాల డైరెక్టర్ నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గాడి అప్పారావు, సీముసురు రమణ పాల్గొన్నారు.

జీ కోడూరులో వివేకానంద జయంతి

మాకవరపాలెం : స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని జీ కోడూరులో ఉన్న వివేకానందుడి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ, బీజేపీ నేతలతోపాటు స్థానికులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మళ్ల జగన్నాథరావు, తోట సత్తిబాబు, బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పిల్లా బాబూరావు, స్థానికులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానంద


స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏకా శివ, పార్టీ నాయకులు

నర్సీపట్నం : స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ కుమార్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పెదబొడ్డేపల్లి ట్యాంక్ బండ్ చెరువు ప్రాంతంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉందని వందేళ్ల క్రితం స్వామి వివేకానంద గుర్తించారన్నారు. భారతీయ యువతరంలో చైతన్యం నింపడానికి, ఆత్మ విశ్వాసం కలిగించడానికి ఆయన తన జీవితమంతా కృషి చేశారన్నారు. ఆయన ప్రసంగాలతో, పుస్తకాలతో సూక్తులతో యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్దేశం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు విజయ్, పెట్ల అప్పలనాయుడు, గంగునాయుడు పాల్గొన్నారు.

శాఖాగ్రంథాలయంలో..

శాఖాగ్రంథాలయంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. పాఠకులతో కలిసి గ్రంథాలయ అధికారి దమయంతి వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని విద్యలో రాణించాలన్నారు.

రోలుగుంట : స్వామి వివేకానంద జయంతి వేడుకను మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాలలో గల స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పచ్చిగోళ్ల ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు చవ్వాకుల భాస్కరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలను గుండుబాడు పంచాయతీలో జనసేన మండలపార్టీ అధ్యక్షుడు బల్లి మహరాజు, రోలుగుంట యువజన సంఘంవారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అసంపూర్తి కల్వర్టుతో పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్‌లో గొయ్యి

నాతవరం : చమ్మచింత గ్రామంలో కొత్తగా నిర్మించిన రోడ్డు కల్వర్టును అసంపూర్తి పనులతో వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రధానరోడ్డులో నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ప్రదేశంలో రోడ్డు మార్జిన్ ఆనుకుని లోతుగా గొయ్యి ఉండి, ఇక్కడ సిమ్మెంటు రోడ్డు నిర్మించే ముందు కల్వర్టు పనులు గొయ్యిని రోడ్డు మార్జిన్‌కు సమాంతరంగా కప్పకుండా వదిలేశారు. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసినా ప్రమాదం బారిన పడతారు. రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వాహనదారులకు కన్పించకుండా ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ గొయ్యి ఉన్న ప్రదేశం మూడు రోడ్ల కూడలి కావడంతో వేగవంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే ఆ గోతిలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా దర్శనమిచ్చే రోడ్డు మార్జిన్ గోతిని కప్పి వేయాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో 2000-2001 బ్యాచ్ విద్యార్థులు


ఉపాధ్యాయులతో 2001-2002 బ్యాచ్ విద్యార్థులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001, అలాగే 2001–2002 విద్యాసంవత్సరాల పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో విడివిడిగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. వారి ఆహ్వానం మేరకు వచ్చిన ప్రస్తుత ఎంఈవో-2 జగ్గారావు, అప్పటి సోషల్ టీచర్ సోములు, అప్పలస్వామి, ఏకా నర్సింహమూర్తి, వెదురుపర్తి నాగభూషణంను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వానితులు విద్య ప్రాముఖ్యం గురుంచి మాట్లాడారు. తమ పిల్లలకు కూడా మంచి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మేలైన విద్యావకాశాలు అందిపుచ్చుకొని, విద్యలో పోటీతత్వం ఏర్పరుచుకునేలా పిల్లలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు వారి గురువుల వద్ద దీవెనలు తీసుకున్నారు.


మాకవరపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం : పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఉత్సాహంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 2007–08 ఏడాదిలో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాచపల్లి జంక్షన్ సమీపంలో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 17 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. సమ్మేళనంతో సుమారు 100 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.